క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: వేసవిలో అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై రైతులు, గొర్రెలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అల్మాస్‌పూర్ అటవీ సెక్షన్ అధికారి పద్మలత అన్నారు. అగ్ని ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు, వాటి నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై అటవీశాఖ అధికారులు వివరించారు. అగ్ని ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలకు జంతువులను వెళ్లకుండా చూడాలన్నారు. అడవిలో ఉండే వణ్యప్రాణులకు ఎలాంటి ఆపద సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆకురాలే సమయంలో అడవిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారులు సతీశ్, బేస్ క్యాంపు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు నిర్వహించి పంటలు సాగుచేయాలి



చందుర్తి: రైతులు పంటల సాగులో నష్టాల బాటనుంచి గట్టెక్కించేందుకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించి పంటలు సాగుచేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య కోరారు. మండలకేంద్రంలో సోమవారం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంటల సాగు విన్నూత పద్ధతులు అవలంబిస్తున్న రైతు వరికెల బాపురావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు వరి తర్వాత రెండో పంట పత్తిని సాగు చేస్తున్నారని, భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సంటి బాపురావు, దుద్దిళ్ల లచ్చిరెడ్డి, పోతురాజు తిరుపతి, ఏరెడ్డి రాజిరెడ్డి, కొమ్ము శంకర్, రామస్వామి, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: పొదుపు, బీమా పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆర్బీఐ కౌన్సిలర్లు రమేశ్ మాట్లాడుతూ.. డిపాజిట్ల రకాలను వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎం, యూపీఐ ఖాతాల గురించి విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, కామర్స్‌విభాగం అధ్యాపకులు మనోహర్, కే.మహేశ్, జగన్నాథం, టాస్క్ కో–ఆర్డినేటర్ శ్రావణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డులను సందర్శించిన అధికారులు



మురుగుకాలువను పరిశీలిస్తున్న కార్యదర్శి

సాక్షి స్పందన

కోనరావుపేట: నిమ్మపల్లిలో 6, 7 వార్డులను కార్యదర్శి అనిల్ సోమవారం సందర్శించారు. గ్రామంలోని రెండు వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో జీపీసిబ్బంది చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

విద్యార్థినికి అభినందన

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లికి చెందిన భుక్య సక్కుబాయి ఈనెల17 నుంచి 20 వరకు తమిళనాడులో జరిగిన 23 నేషనల్ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా గ్రామస్తులు గిరిజన నాయకులు ఆమెను అభినందించారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

కోనరావుపేట: ధర్మారంకు చెందిన ఓ డిగ్రీ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పొట్ల బాలమల్లు–మంజుల దంపతుల కుమారుడు రాకేశ్(18) హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వస్తూ సిరిసిల్ల బస్టాండ్‌లో ధర్మారం గ్రామానికి వెళ్లే ఆటోలో తన బ్యాగ్ పెట్టాడు. ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సిరిసిల్ల బస్టాండ్ ఆవరణలోని సీసీ ఫుటేజీ ద్వారా విచారణ జరుపుతున్నట్లు సోమవారం పేర్కొన్నారు.







ఆలయాలు జిగేల్..

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో వైభవంగా జరిగే మహాశివరాత్రి వేడుకలకు రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి గుట్టపై ఉన్న కాళీయమార్ధనాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. నందికమాన్ వద్ద విగ్రహానికి విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే నందికమాన్, నాంపల్లి ఘట్ రోడ్డు కమాన్‌కు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బండి వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్: రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐటీ రంగానికి పునర్జీవం పోసిన కేటీఆర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్, కేబినెట్ మంత్రి కిషన్ రెడి, రాష్ట్రానికి చిల్లిగవ్వ తీసుకురాలేదని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు.కార్యక్రమంలో తిరుపతి, సంపత్, నిఖిల్, లక్ష్మణ్, సంతోష్, రాజు, అక్రమ్, రాము, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటినిర్మాణం కూల్చివేత



అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న ఇంటి యజమాని

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయం పక్కన నూతనంగా నిర్మిస్తున్న ఇంటిని సోమవారం పంచాయతీ అధికారులు కూల్చివేశారు. సత్యనారాయణ అనే వ్యక్తి అన్ని అనుమతులతో ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే సత్యనారాయణ ఇంటి నిర్మాణం స్థలం పక్కనే ఉన్న సద్దిమద్దుల సంఘంకు చెందినదిగా, సంఘం సభ్యులు గతంలో పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల వారు పోలీసులు, కలెక్టర్‌ను కలిశారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు కొనసాగుతుండగా, సద్దిమద్దుల సంఘం సభ్యులు కోర్టును ఆశ్రయించారు. నిర్మాణ పనులు నిలిపివేయాలని కోర్టు ఆధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో గ్రామ పంచాయతీ ఈవో ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు.దీంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.



వరిపైరు పశువులకు మేత

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని గిరిజన గ్రామాల్లోని పంటలు ఎండిపోతున్నాయి. బాబాయి చెరువుతండాకు చెందిన రైతు మాలోతు తిరుపతి తనకున్న రెండు ఎకరాల్లో వరిపంట వేశాడు. తన పొలంలోని బోరులో నీరు తగ్గిపోవడంతో రెండు ఎకరాలు పారే అవకాశం లేక ఒక ఎకరం వరకు వదిలేశాడు. మిగిలిన ఎకరంలోని పంటను బోరులో వచ్చే కొద్దిపాటి నీటితో కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఇలా వదిలేసిన పొలంలో పశువులు మేస్తున్నాయి. ఎకరం పొలంలో విత్తనాలు విత్తినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.20వేల వరకు ఖర్చు చేశాడు. ఆ మొత్తం నష్టపోయినట్లేనని రైతు తిరుపతి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఇల్లంతకుంట: సీఎం సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎస్సారార్ కళాశాల మైదానంలో సోమవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, నాయకులు శ్రీనివాస్ గౌడ్, నేవూరి వెంకట్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి, బుగ్గ కృష్ణమూర్తి శర్మ, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, వంగ గిరిధర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల కాంగ్రెస్ నాయకులు కరీంనగర్‌లో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి సభకు తరలివెళ్లారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మండల రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మానకొండూర్ నియోజకవర్గం అధికార ప్రతినిధి పసుల వెంకటి, అనంతగిరి వినయ్ కుమార్, కూన బోయిన బాలరాజు, ఎండీ జమాల్, మామిడి నరేశ్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● 'మతోన్మాద పార్టీలకు దూరం'

సిరిసిల్లటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ మతోన్మాద శక్తులకు దూరంగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీవైనగర్ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సైనిక్ పాఠశాల, నవోదయ పాఠశాలలు, సిరిసిల్లకు ఈఎస్ఐ హాస్పిటల్ తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని చిత్తు ఓడించాలని కోరారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ, విమల, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పద్మ, రమేశ్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబవుతున్న ఆలయాలు

కోనరావుపేట: మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని గ్రామాల్లో శివాలయాలు ముస్తాబవుతున్నాయి. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా నిజామాబాద్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, వట్టిమల్లలో శివసాయి ఆలయం, కోనరావుపేటలోని హనుమాన్ దేవాలయం, మామిడిపల్లిలోని మహదేవ ఆలయం, కనగర్తిలోని రాజరాజేశ్వరస్వామి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాల్లో స్వామివారి కల్యాణ వేడుకలు, ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

● వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: సామాజిక మాధ్యమాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన శామీర్‌పేట మల్కాజిగిరి మేడ్చల్‌కు చెందిన నూనెముంతల రవీందర్ గౌడ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వేములవాడ దేవస్థానానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేశాడన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

● యూరియా కొరత లేకుండా చూడాలి

బోయినపల్లి: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రన్నారు. సింగిల్‌విండో, సహకార సంఘాల ద్వారా రైతులకు సరిపడా యూరియా బస్తాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్



సిరిసిల్లటౌన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు స్పందన లభించింది. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించగా ప్రశ్నాపత్రాలను యూటీఎఫ్ నాయకులు పాకాల శంకర్ గౌడ్, అంబటి రమేశ్, మల్లేశం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సాయి, భరత్, శివ, నాయకులు జశ్వంత్, మదన్, ముబారక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గంభీరావుపేటలో సోమవారం పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ మాట్లాడారు. వీటి ద్వారా పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం పడతాయని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా, మండల స్థాయిల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



చందుర్తి: బీజేపీ కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడిగా చింతకుంట సాగర్ (నర్సింగపూర్)ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మోకిలి విజేందర్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా లింగాల రాజన్న(చందుర్తి), ప్రధాన కార్యదర్శిగా తీపీరెడ్డి మనోహర్‌రెడ్డి (బండపల్లి)ని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు విజేందర్ పేర్కొన్నారు.

విద్యార్థుల కేత్రస్థాయి పర్యటన



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు జిజ్ఞాస స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా వేములవాడ కేడీసీసీ బ్యాంకును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు ఇచ్చే రుణాలు, వాటి వడ్డీ రేట్ల గురించి వివరించారు. రుణాలు పొందిన ఖాతాదారులు తిరిగి చెల్లించే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏటా డిపాజిట్లు చేస్తున్నారు.. ఎంతమందికి రుణాలు అందిస్తున్నారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, కామర్స్ అధ్యాపకులు లావణ్య, నర్సయ్య, విద్యార్థులు రాజేశ్, జస్వంత్, భవిత, ఉషారాణి తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

వీర్నపల్లి: మండలంలోని బాబాయి చెరువు తండాలోసోమవారం జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ మదన్‌లాల్ నాయక్, నాయకులు, తదితరులున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నందికమాన్ ప్రాంతంలో నివాసముంటున్న చందుర్తి మండలం మూడపల్లికి చెందిన వేముల ముత్యం (62) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ముత్యం ఆదివారం వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వజ్రోత్సవాలకు హాజరై తన చిన్ననాటి స్నేహితులను కలుసుకున్నారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చాడు. సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

వేములవాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట పెట్రోల్ బంక్ వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

జాతరకు పకడ్బందీ బందోబస్తు

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం
- వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి



వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన వేములవాడలో మూడు రోజులపాటు జరిగే మహాశివరాత్రి వేడుకలకు పకడ్బందీగా బందోబస్తు చేపడుతున్నట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే రోడ్డుమ్యాప్ సిద్ధం చేశామని, ఆలయం పరిసరాల్లో దాదాపు 500 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. మహాశివరాత్రి సందర్భంగా తీసుకుంటున్న భద్రత చర్యలను 'సాక్షి' ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆమె మాటల్లోనే..

బందోబస్తుకు 1500 మంది

రాజన్న ఆలయంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగే మహాశివరాత్రి జాతరకు 1500 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం. జాతర విధులకు హాజరయ్యే సిబ్బంది సోమవారం రిపోర్టు చేశారు. ఈనెల 25 నుంచి 27 వరకు నిత్యం మూడు షిఫ్టుల్లో బందోబస్తు చర్యల్లో పాల్గొంటారు. పోలీసు సిబ్బందికి వసతి కోసం ఫంక్షన్‌హాల్, భోజనవసతి కోసం అన్నదానసత్రం, పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేశాం.

గుడి చెరువులో పార్కింగ్

రాజన్న ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల కోసం గుడిచెరువులో పార్కింగ్ కేటాయించాం. గుడి చెరువులో 1 నుంచి 8 వరకు సెక్టార్లుగా పార్కింగ్ ప్లేస్‌ను సిద్ధం చేశాం. వీఐపీల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశాం. వాహనాలు అధికంగా వస్తే సాయి రక్ష దాబా వద్ద మరో పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేశాం. గుడి చెరువులోకి వాహనాలు వచ్చే పోయేందుకు ఇన్, ఔట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం.

ఆలయ పరిసరాల్లో భారీ బందోబస్తు

రాజన్న ఆలయంతోపాటు చుట్టూ పరిసరాల్లో భారీ బందోబస్తు చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు 500 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నాం. తిప్పాపూర్, నాంపల్లి కమాన్, నందికమాన్, అమరవీరులస్తూపం, చెక్కపల్లి బస్టాండ్ తెలంగాణచౌక్, జగిత్యాల బస్టాండ్ వద్ద పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. భీమేశ్వర, బద్దిపోచమ్మ, నాంపల్లి గుట్ట, అగ్రహారం వద్ద ఉన్న ఆలయాల వద్ద కూడ పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపడతారు. వేములవాడ చుట్టూ నలుమూలల వాహనదారులు ఇబ్బంది పడకూడదని సూచికబోర్డులు ఏర్పాటు చేయించాం.

తెలంగాణ ఉద్యమకారుడికే మద్దతివ్వండి

సిరిసిల్లటౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుడు సర్దార్ రవీంద్రసింగ్‌కు మద్దతివ్వాలని శాతవాహన జేఏసీ చైర్మన్ చెన్నమల్ల చైతన్య కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూపాయికి అంత్యక్రియలు, రూపాయికే ఇంటింటికి నల్ల, మధ్యాహ్నం భోజన పథకం లాంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఆకినపల్లి నరేశ్, బోయిని ప్రణీత్, అఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



బోయినపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ఇల్లంతకుంటలో..

ఎల్లారెడ్డిపేట: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యంగా నరేందర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్, దుమాల, బండలింగంపల్లిలో సోమవారం నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బుచ్చాగౌడ్, గుర్రపు రాములు, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండలంలోని బోయినపల్లి, మాన్వాడ, మల్కాపూర్, రత్నంపేట తదితర గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జంగం అంజయ్య, కరీంనగర్ వర్కింగ్ జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, సంబ లక్ష్మిరాజం, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, ఏనుగుల కనుకయ్య, పులి లక్ష్మీపతి, ఎండీ.నజీర్, పిట్టల రమేశ్, మెరుపుల మహేశ్, జలేందర్ తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. మానకొండూర్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి, పీసీసీ కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి, అనంతగిరి వినయ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో బస్‌షెల్టర్ ఎదురుగా ఉన్న చేతిపంపు వద్ద పరిసరాలు అధ్వానంగా మారాయి. గతంలో ఈ చేతిపంపు గ్రామస్తుల నీటి అవసరాలు తీర్చింది. ఇప్పుడు చేతిపంపు పనిచేయకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చేతిపంపును వినియోగంలోకి తీసుకువచ్చి, పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : అభిషేక్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, బోయినపల్లి, సెల్ నంబర్ : 7702102455

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

గుంత పూడ్చివేత

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం దారి ఇలా శీర్షికన ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి మట్టిపోసి గుంతలను పూడ్చారు.